# నమస్తే తెలంగాణ
# వికారాబాద్

I | హైదరాబాద్, మంగళవారం 18 జూన్ 2024 | VIKARABAD


# 17 మందికే పదోన్నతి..



**గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల ప్రమోషన్లలో వికారాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం**

**జీహెచ్ఎం పోస్టులను మల్టీ జోన్-1 పోస్టుగా మార్చడంతో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి అధికంగా జిల్లాకు అలాట్**

**94 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్ఎంలుగా పదోన్నతి**

**ఇప్పటికే 90 మంది టీచర్లు విధుల్లో జాయినింగ్**

**కొనసాగుతున్న పదోన్నతుల ప్రక్రియ**

**స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు జిల్లా విద్యాశాఖ సిద్ధం**

వికారాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయుల పదోన్నతుల్లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగింది. ఇందుకు కారణం జీహెచ్ఎం(గెజిటెడ్ హెడ్‌మాస్టర్) పోస్టులను మల్టీ జోనల్ పోస్టుగా మార్చడమే. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతుల్లో భాగంగా జిల్లాకు 94 మంది అలాట్ అయ్యారు. అయితే వారిలో జిల్లాకు చెందిన 17 మందే స్కూల్ అసిస్టెంట్లున్నారు. మిగతా 77మంది ఇతర జిల్లాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లున్నారు. అందులో అధికంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారున్నారు. అయితే మల్టీ జోన్-1లో ఎక్కువగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారే సీనియారిటీలో ముందుండడంతో జి ల్లా ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగింది. జిల్లాలో పదోన్నతులు పొందిన 94 మంది గెజిటెడ్ హెడ్‌మాస్టర్లలో ఇప్పటివరకు 90మంది విధుల్లో చేరగా, మరో నలుగురు జాయిన్ కావాల్సి ఉన్నది. మరోవైపు ప్రమోషన్లలో భాగంగా 97 మంది ఎస్జీటీలకు సీనియారిటీ ఉన్నా కోర్టు తీర్పుతో పదోన్నతులు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందని పలువురు బీఎడ్ పూర్తి చేసి ఎస్జీటీలుగా కొనసాగుతున్న టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తర్వాత సీనియారిటీ జాబితాలో ఉన్న డీఎడ్ పూర్తి చేసిన ఎస్జీటీలకు ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్లుగా ప్రమోషన్లు దక్కనున్నాయి.

### స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు కసరత్తు..

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా జీహెచ్ఎం(గెజిటెడ్ హెడ్‌మాస్టర్)ల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి గతంలోనే టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. స్కూ ల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి కటాఫ్ తేదీని జూన్ 1గా ప్రభుత్వం ప్రకటించింది. ఒకే బడిలో రెండేండ్ల సర్వీసు జూన్ 1 నాటికి పూర్తైన స్కూల్ అసిస్టెంట్లు ఉంటే బదిలీ కోసం జిల్లా విద్యాశాఖ అధికారికి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ప్రభుత్వ స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు ఇలా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్-2, జీవశాస్త్రం-1 (ఉర్దూ మీడియం), ఎస్ఏ హిందీ-3, పీడీ-1, ఎస్ఏ భౌతికశాస్త్రం-1, ఎస్ఏ సాంఘిక శాస్త్రం-2(తెలుగు-1, ఉర్దూ మీడియం1), ఎస్ఏ తెలుగు-2, ఎస్ఏ ఉర్దూ-1 పోస్టు ఖాళీగా ఉన్నాయి. లోకల్ బాడీ స్కూళ్లలోని స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలకు సంబంధించిన అంశం ఇంకా కొలిక్కి రాలేదు. అయితే స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ పూర్తైన అనంతరం ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులివ్వనున్నారు.

### త్వరలో అప్‌గ్రేడ్ భాషా పండితులకు పోస్టింగులు..

అప్‌గ్రేడ్ అయిన భాషా పండితులకు త్వరలోనే పోస్టింగులు ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే జిల్లాలో 338 మంది భాషా పండితులుండగా వారిలో 301 మంది అప్‌గ్రేడ్ అయ్యారు. ఎల్పీ తెలుగు 167 మంది లో 149 మందికి, ఎల్పీ హిందీ 163 మందిలో 145 మందికి, ఎల్పీ ఉర్దూ-ఏడుగురిలో ఆరుగురికి, ఎల్పీ సంస్కృతం ఒక పోస్టుకు ఒకరు అప్‌గ్రేడ్ అయ్యారు.

భాషా పండితులు స్కూల్ అసిస్టెంట్లుగా, పీఈటీలు స్కూల్ అసిస్టెంట్ పీడీలుగా అప్‌గ్రేడ్ అయ్యారు. అదేవిధంగా భాషా పండితులు ఇకపై స్కూల్ అసిస్టెంట్ తెలు గు, స్కూల్ అసిస్టెంట్ హిందీ, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పోస్టులకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్జీటీలు ఇకపై స్కూల్ అసిస్టెంట్ సోషల్, ఎస్ఏ జీవశాస్త్రం, ఎస్ఏ భౌతికశాస్త్రం, ఎస్ఏ గణితంగా పదోన్నతులు పొందనున్నారు.



# వికారాబాద్ ఎస్పీగా నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 17 : వికారాబాద్ జిల్లా ఎస్పీగా కె.నారాయణ రెడ్డి నియమితులయ్యారు. శంషాబాద్ డీసీపీగా పని చేస్తున్న ఆయన్ను జిల్లా ఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జిల్లా ఎస్పీగా పని చేస్తున్న ఎన్.కోటి రెడ్డిని మేడ్చల్ జోన్ డీసీపీగా ప్రభుత్వం బదిలీ చేసింది. నేడు నారాయణ రెడ్డి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎస్పీ కె.నారాయణ రెడ్డి




మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఏది కొందామన్నా వామ్మో ఇంత రేటా.. అని కంగుతినాల్సి వస్తున్నది. రంగారెడ్డి జిల్లాలో రోడ్ల వెంట ఉన్న కూరగాయల దుకాణాలు మొదలు.. ఏ మార్కెట్‌కు వెళ్లినా ధరలు దడ పుట్టిస్తున్నాయి.. ఇదివరకు రూ.300 ఖర్చు చేస్తే వారం రోజులకు సరిపడా కూరగాయలు వచ్చేవి.. కానీ ప్రస్తుతం రూ.500 ఖర్చు చేసినా మూడు రోజులకు సరిపడా కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు.. 'ఏమి కొనేటట్టులేదు.. ఏమి తినేటట్టు లేదు.. లచ్చులో లచ్చన్న.. ధరలిట్ట మండవట్టే లచ్చులో లచ్చన్న..' అన్న సినిమా పాట సామాన్యులకు మళ్లీ గుర్తుకొస్తున్నది. మొన్నటి వరకు ఎండల తీవ్రత.. నేడు వర్షాలతో పంటలు దెబ్బ తింటున్నాయి. కూరగాయల సాగు తగ్గి కొరత ఏర్పడడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. కోడి గుడ్డు, చికెన్ ధరలతో వెజిటెబుల్స్ పోటీపడుతుండడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు.

- రంగారెడ్డి, జూన్ 17 (నమస్తే తెలంగాణ)

# ధరాఘాతం

## భగ్గుమంటున్న కూరగాయల ధరలు

### సాగు తగ్గడమే ప్రధాన కారణం..



జిల్లా జనాభాకు ఏడాదికి 1.65 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం. జిల్లాలో ఇంతకంటే ఎక్కువగానే అంటే 1.95 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు పండుతున్నాయి. అయితే హైదరాబాద్ నగరవాసుల అవసరాలను సైతం జిల్లాలో పండిన కూరగాయలే తీరుస్తుండడంతో ఇంకా అదనంగా 1.60 లక్ష ల మెట్రిక్ టన్నుల కూరగాయల అవసరం ఏర్పడుతున్నది. ఈ కొరతను అధిగమించేందుకు కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఉద్యానవన శాఖ ప్రయత్నం చేస్తున్నా ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రైతులు కూరగాయల సాగుకు అంతగా ఆసక్తి చూపడంలేదు. కాస్తో..కూస్తో సాగు చేసిన పంటలు అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో దెబ్బతిని రైతుల బతుకులు ఆగం అవుతున్నాయి. ఫలితంగా రైతుల ఆసక్తి తగ్గి..ఏటా కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తున్నది. 2021-22 వా నకాలంలో 62,598 ఎకరాల్లో పండ్లు, కూరగాయలను జిల్లా రైతాంగం సాగు చేసింది. 2022-23లో 64,397 ఎకరాల్లో, 2023-24లో 60,714 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. ప్రస్తుత వానకాలంలో కేవలం 15,461 ఎకరా ల్లోనే ఉద్యాన పంటలు సాగు అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తు న్నారు. ప్రస్తుతం ఉద్యానసాగు తగ్గడంతో చాలా వరకు కూరగాయలను జిల్లాకు దిగుమతి చేసుకునే పరిస్థితి వచ్చింది.



### వారం, పది రోజుల వ్యవధిలోనే ..

నిన్నమొన్నటి వరకు అందుబాటులో ఉన్న కూరగాయల ధరలు ఒక్కసారిగా భగ్గు మంటున్నాయి. వారం, పది రోజులుగా ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రూ.60 ఉన్న కిలో టమాట ధర ఏకంగా రూ.90కి చేరింది. పచ్చిమిర్చి ధర రూ. 120కి పైగానే పలుకుతున్నది. వంద రూపాయలకు మూడు నాలుగు కిలోలు వచ్చే ఉల్లిగడ్డను ప్రస్తుతం రూ.50కి కిలో చొప్పున విక్రయిస్తున్నారు. ఆకుకూరలను సైతం కొనే పరిస్థితి లేకుండా పోయింది. మొన్నటి వరకు రూ.20కి నాలుగు కట్టల వరకు ఇవ్వగా..ప్రస్తుతం రెండు కట్టలే ఇస్తున్నారు. కూరగాయల కొరతతో చాలా వరకు కూరగాయలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. హోల్ సేల్ వ్యాపారులు లాభాలు చూసుకున్న తర్వాత రీసేల్ వ్యాపారులకు అమ్ము తున్నారు.

అక్కడి నుంచి సాధారణ వినియోగదారులకు చేరే సరికి కూరగాయల ధరల రేటు మరింత ఎక్కువగా ఉంటున్నది. ధరల పెరుగుదలతో. చేసేదేమీ లేక కిలో కూరగాయలు కొనేవారు ప్రస్తుతం అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు.





**మార్కెట్‌లో ప్రస్తుతం కూరగాయల ధరలు ఇలా..**

| కూరగాయలు | కేజీ(రూ..లలో) |
|---|---|
| టమాట | 90 |
| మిర్చి | 120 |
| క్యారెట్ | 100 |
| చిక్కుడు | 100 |
| బీరకాయ | 120 |
| కాకరకాయ | 80 |
| కాలిఫ్లవర్ | 80 |
| క్యాప్సికమ్ | 80 |
| వంకాయ | 40 |
| బీట్‌రూట్ | 80 |
| చామగడ్డ | 80 |
| దోసకాయ | 60 |
| సోరకాయ | 80 |



### కొనలేకపోతున్నాం..

పెరిగిన ధరలతో కూరగాయలను కొనలేకపోతున్నాం.. వారాంతపు సంతలో ఏ కూరగాయల ధర అడిగినా కిలో రూ.60 నుంచి రూ.80 పలుకుతున్నది. ఇదివరకు ఏదైనా కూరగాయ కిలో కొనేటోళ్లం.. ప్రస్తుతం పావు, అర కిలోతో సరిపెట్టుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల ధరలను నియంత్రించాలి.

-కూకుట్ల శ్రీలత, గృహిణి, కడ్తాల్ మండలం

### బతుకు భారమైంది..

నిత్యావసర ధరలు పెరుగడం వల్ల బతుకు భారమవుతున్నది. మార్కెట్‌లో ఇదివరకు తక్కువ ధరకు దొరికే కూరగాయలు, ఆకుకూరలు అమాంతం పెరిగాయి. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు కొనలేని.. తినలేని పరిస్థితి. కిరాణం, వంట సామాను, గ్యాస్, బియ్యం, పాల ధరలు పెరిగాయి. ప్రభుత్వం ధరలను అదుపు చేయాలి.

- కొమ్ము జెలమ్మ , గుర్రంగుట్ట కాలనీ, ఆమనగల్లు









చేవెళ్లలో..

**ఈద్గా, మసీద్‌ల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు**

**ఈద్-ఉల్-జుహాలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు**





తాండూరులో..

# భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీక బక్రీద్, దేవుడి కోసం ప్రాణాలు ఇవ్వడానికి వెనుకాడని భక్తిభావం.. సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ (ఈద్-ఉల్-జుహా) పండుగను ఘనంగా జరుపుకొన్నారు. వేకువ జామునే నిద్ర లేచి కొత్త దుస్తులు ధరించి డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా ఈద్గా, మసీద్‌ల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ బోధనలు, బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. నిరుపేదలకు ఆహార పదార్థాలను పంపిణీ చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ